క్లుప్తంగా

ఘనంగా బ్రహ్మోత్సవాలు



రాయపర్తి : మండలంలోని సన్నూరు వెంకటేశ్వరపల్లిలోని ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిత్య హోమం, బలిహరణం, శేషవాహనసేవ, గంధ వళి, బత్తీసలాట, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. శేషవాహనంపై శ్రీనివాసుడిని ఊరేగించగా భక్తులు, గ్రామస్తులు పూజలు చేశారు.

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



చెన్నారావుపేట : పోలింగ్ కేంద్రాల తుది జాబితాను స్థానిక అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ఎంపీడీఓ నల్ల శ్రీవాణి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలో 11 ఎంపీటీసీలకు 30 గ్రామాల పరిధిలో 56 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సదరు పోలింగ్ బూత్‌ల వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేందర్, పంచాయతీ కార్యదర్శులు రాజు, శ్యామ్, శ్యాంప్రసాద్, స్వరాజ్యం, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రణవ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కరువు'

నర్సంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కరువై విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేశ్ ఆందోళన వెలిబుచ్చారు. పట్టణంలోని బాయ్స్ హైస్కూల్‌ను ఆయన ఆధ్వర్యంలోని బృందం శనివారం సందర్శించి సదుపాయాలపై అధ్యయనం చేసింది. అనంతరం గణేశ్ మీడియాతో మాట్లాడారు. స్కూల్‌లో తాగు నీటి, మూత్రశాలల, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తుండడంతో విద్యార్థులు ఇళ్ల నుంచి లంచ్ బాక్స్‌లు తెచ్చుకుంటున్న దుస్థితి నెలకొందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి విద్యార్థులకు తాగు నీటి, మూత్రశాలలు నిర్మించడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జయేందర్, ప్రణయ్, వినయ్, సాయి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో వెలమ సంక్షేమ సంఘం కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చౌలపల్లి చలపతిరావు, అధ్యక్షుడిగా పల్లెపాటి రాంచందర్‌రావు, ఉపాధ్యక్షుడుగా ఎస్.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జూలపల్లి మోహన్‌రావు, సహాయ కార్యదర్శిగా సూరినేని సుధీర్‌రావు, కోశాధికార్లుగా పెరాల దేవేందర్‌రావు, జూలపల్లి వెంకటేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడారు. వెలమ కులస్తుల సంక్షేమానికి సంఘం పాటుపడుతుందని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గుడ్డెల్లుగులపల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంద కుమారస్వామి (57) ఈనెల 12న నందిగామకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలపాలైన ఆయన్ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలైన ఘటన మండలంలోని రాజుపేట శివారులో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఖానాపురం మండలంలోని పాకాల నుంచి నర్సంపేట దిశగా తన ద్విచక్ర వాహనంపై వస్తున్న కేశపాక వంశీ రాజుపేట శివారులోని నర్సంపేట-కొత్తగూడ ప్రధాన రహదారిపై సాకరి మూల వద్ద వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. వంశీకి గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అయ్యో దేవా.. గోడు ఆలకించేదెవరు?

- సంగెం, వర్ధన్నపేట, ఖిలావరంగల్ మండలాలకు దేవాదుల నీరు బంద్
- ఎత్తిపోతల నుంచి రాకుండా తూములు మూసిన ఐనవోలు మండల రైతులు
- ఎండిపోతున్న పంటలు
- పాలకులు, అధికారులు స్పందించాలని అన్నదాతల వేడుకోలు



ఐనవోలు మండలంలో నిండుగా ప్రవహిస్తున్న దేవాదుల ఎత్తిపోతల కాల్వ

సంగెం : ఎప్పటిలాగే దేవాదుల ఎత్తిపోతల నీరు వస్తుందనే ఆశతో సంగెం, వర్ధన్నపేట, ఖిలా వరంగల్ మండలాల్లో రైతులు పంటలు సాగు చేశారు. కాల్వ వెంట ఉన్న సుమారు 2 వేల ఎకరాలతోపాటు కుంటలు, చెరువుల్లోకి సైతం నీరు వచ్చేదని రైతులు తెలిపారు. రైతులు రాత్రింబవళ్లు నిద్రాహారాలు మాని కాల్వ వెంట ఉంటూ సంగెం మండలం ఆశాలపల్లి, గవిచర్ల గ్రామాల్లోని పంటలకు నీరందించారు. 20 రోజులుగా చుక్క నీరు రావడం లేదు. ఎందుకని పలువురు రైతులు కాల్వ వెంట వెళ్లారు. ఐనవోలు మండలం వెంకటాపూర్ వద్ద వర్ధన్నపేట మండలం చెన్నారం, ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట, సంగెం మండలం ఆశాలపల్లి, కాట్రపల్లి, గవిచర్ల, తీగరాజుపల్లి, రామచంద్రాపురం, లోహిత, షాపూర్ తదితర గ్రామాలకు నీరు రాకుండా కాల్వ రెండు గేట్‌వాల్వ్‌లు పూర్తిగా మూసివేసి సిమెంట్ పోశారు. ఒక తూముకు అడ్డంగా సిమెంట్ పోయగా కొద్దిగా జాలు మాత్రమే వస్తోంది. దీంతో నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి మూడు మండలాల్లోని ఆయకట్టుకు నీరు వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కాల్వ నీరే ఆధారం



దేవాదుల ఎత్తిపోతల నీరు వస్తుందనే ఆశతో మొక్కజొన్న పంట సాగు చేశాం. పంట కంకి దశలో ఉన్నది. ఇప్పుడు నీరు అవసరం. అక్కడి రైతులు తూములు మూసేయడంతో నీరు రావడం లేదు. పంట చేతికి వచ్చే సమయంలో నీరు రాకుంట చేశారు.

\- పెద్దపల్లి సాంబయ్య, రైతు గవిచర్ల



ఐనవోలు మండలంలో నీరు రాకుండా పోసిన సిమెంట్



సంగెం మండలంలోని కాల్వలో కొద్దిగా వస్తున్న నీరు

పాలన చేతకాక అక్రమ అరెస్టులు



అరెస్టైన వారితో మాట్లాడుతున్న దయాకర్‌రావు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వం పాలన చేతకాక ప్రతిపక్ష పార్టీల నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని మైలారంలో ఇటీవల జరిగిన మారెమ్మ, దుర్గమ్మ ఉత్సవాల సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన లేతాకుల మధూకర్‌రెడ్డి, బైరు యాకయ్య, కోల సంపత్, గబ్బెట అనిల్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి దయాకర్‌రావు శనివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అరెస్టైన నాయకులు, కార్యకర్తలతో పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మీడియాతో దయాకర్‌రావు మాట్లాడారు. మారెమ్మ, దుర్గమ్మ ఉత్సవాల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల నడుమ తోపులాట చోటు చేసుకోగా అధికార పార్టీ నేతలు ప్రభుత్వ ఒత్తిడితో బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులతో కేసులు పెట్టించారని మండిపడ్డారు. శ్రేణులకు బెయిల్ మంజూరైందంటూ హర్షం వ్యక్తం చేశారు. అంతిమంగా న్యాయమే గెలుస్తుందని స్పష్టం చేశారు. ఇకనైనా అక్రమ అరెస్టులపై కాకుండా ప్రజలకు సేవలు అందించడంలో దృష్టి పెట్టాలని అధికార పార్టీ నేతలకు హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ పల్లా సుందర్ రామిరెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహానాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు



పర్వతగిరి : అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై బి.ప్రవీణ్ స్పష్టం చేశారు. మండలంలోని ఆకేరు వాగు శివారులోని కల్లెడ, రోళ్లకల్, నారాయణపురం, చెరువు ముందు తండా గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపులను ప్రొబేషనరీ ఎస్సై కల్యాణ్, రెవెన్యూ అధికారులతో కలిసి ఎస్సై ప్రవీణ్ శనివారం సందర్శించారు. అనంతరం ఎస్సై ప్రవీణ్ మాట్లాడారు. ఆకేరు వాగు పరివాహక ప్రాంతాల్లో, పట్టా భూముల్లో నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసు పెడతామని చెప్పారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ప్రభుత్వ నిర్ణయంతో రోడ్డున పడ్డాం'

దుగ్గొండి : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తాము రోడ్డున పడ్డామని ఆటో డ్రైవర్లు వాపోయారు. తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) ఆధ్వర్యంలో మండలంలోని గిర్నిబావిలోని వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై ఆటోడ్రైవర్లు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుండడంతో తాము నష్టపోయిన క్రమంలో తమకు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, 50 ఏళ్లకుపైబడ్డ వారికి నెలకు రూ.5 వేల చొప్పున పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బూర రామకృష్ణ, దేవేందర్, సాంబమూర్తి, సాగర్, కుమార్, శివ, రాజు, రహీం, సురేశ్, తిరుపతి, అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

'ఎక్స్‌గ్రేషియాతోపాటు ఉద్యోగం ఇవ్వాలి'

నల్లబెల్లి : మెదక్ జిల్లాలోని చేగుంట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఆర్పీలు రమేశ్, శ్రీనివాస్ మృతి చెందిన క్రమంలో బాధిత కుటుంబాలకు రూ.20 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల ఐక్యవేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు సుద్దాల ఆనందం కోరారు. సీఆర్పీల మృతి నేపథ్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీలో వేదిక ఆధ్వర్యంలో శనివారం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఆనందం మాట్లాడారు. బాధిత కుటుంబాలకు సీఆర్పీలు అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) సునీత, ఎస్ఎస్ఏ ఉద్యోగులు జ్యోతి, శ్రీమాత, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



చెన్నారావుపేట : విద్యార్థులతో చైర్మన్ గోపాల్‌రెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులు

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని న్యూ విజన్ హైస్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. డీఈఓగా మణికంఠ, ఎంఈఓగా ముప్పు నవీన్, కరస్పాండెంట్‌గా నల్ల సాకేత్, ప్రిన్సిపాల్‌గా సింధు, ఉపాధ్యాయులుగా మహిపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజు, శ్రీశైలం, సాంబయ్య, రాజు, వేణుగోపాల్, నాగరాజు, రంజిత్ వ్యవహరించారు.

విద్యోదయ గురుకుల స్కూల్‌లో..

నెక్కొండ : మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల స్కూల్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులను తలపించేలా తరగతులు బోధించారు. డీఈఓగా మహ్మద్ జనైద్, డిప్యూటీ డీఈఓగా వాసవి, ఎంఈఓగా ధరణి, ప్రిన్సిపాల్‌గా మహ్మద్ సమీద్, ఎమ్మెల్యేగా నాగరాజు, ఎంపీగా వివేక్, ఉపాధ్యాయులుగా కొందరు విద్యార్థులు వ్యవహరించి అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

సిద్దార్థ హైస్కూల్‌లో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో చిన్నారులు ఉపాధ్యాయులుగా, ఉద్యోగులుగా అలరించారు. డీఈఓగా సహస్ర, ఎంఈఓగా త్రైత్రశ్రీ, చైర్మన్‌గా జస్వంత్, హెచ్ఎంగా తరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్‌గా కరుణశ్రీ, ఎంపీడీఓగా ప్రసన్న, ఎంపీఓగా భరత్, వైద్యులుగా తిరుమల, వినోద్‌కుమార్, పీఈటీలుగా అమృత వర్షిని, ప్రియాంక, హిమబిందు వ్యవహరించారు. కార్యక్రమంలో సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, హెచ్ఎం అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీని గెలిపించాలి

- సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, సారయ్య

నర్సంపేట : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ సామాజికవర్గానికి అభ్యర్థిని గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్, సోల్తి సారయ్యగౌడ్ కోరారు. పట్టణంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. ఈ క్రమంలో రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించేలా సంక్షేమ సంఘం మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జీజుల సాగర్, జిల్లా కార్యదర్శి నీలారపు నరేందర్ యాదవ్, నియోజకవర్గ నాయకులు సాంబరాతి మల్లేషం, ఖానాపురం మండల అధ్యక్షుడు గంద్రాతి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు కందికొండ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యాంకుమార్ యాదవ్, కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, మారపాక రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

నర్సంపేట రూరల్ : ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ లంచాల కోసం ప్రజలను వేధిస్తున్నాడంటూ పంచాయతీ కార్యదర్శిపై నర్సంపేట మండలంలోని రాములునాయక్ తండాకు చెందిన భూక్య రాజు ఎంపీడీఓ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓకు రాజు శనివారం వినతిపత్రం అందించి వివరాలు వెల్లడించారు. తాను ఇల్లు నిర్మించుకునేందుకు గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నానని, రూ.5 వేలు అడిగితే లంచం ఇచ్చానని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని పలుమార్లు అడగడంతో తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని వాపోయాడు. గతంలోనూ లంచాలు దండుకుని ఇంటి నిర్మాణ అనుమతి కూడా ఇవ్వకుండా పలువురిని ఇబ్బందుల పాల్జేశాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌లో పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి అవార్డులు కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్ తెలిపారు. స్కూల్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, ఇన్‌చార్జ్ రాధ, ఉపాధ్యాయులతో కలిసి ప్రిన్సిపాల్ అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. స్కూల్ విద్యార్థులు జి.శుభయశ్రీ రాష్ట్రస్థాయిలో నాల్గో, జి.సహస్ర ఐదో బహుమతి సాధించగా అజేంద్రవర్మ, దక్షిత, ఇమ్మాన్ జిల్లాస్థాయిలో రెండో, సాయి అద్విక్ ధయ్, హర్షిన్, వి.సాయిప్రణీత, స్వేచ్ఛ, బి.ధనుష్, వి.సాత్విక, ఈ.రాజవర్ధన్, కె.పూజిత కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పవన్, కృష్ణ, లత, జ్యోతి, హరిప్రియ, సమత, తదితరులు పాల్గొన్నారు.

బంజారాల జాగృతికి సేవాలాల్ కృషి



నెక్కొండ : పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



పర్వతగిరి : ఎమ్మెల్యేకు సేవాలాల్ చిత్రపటం బహూకరిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

- ఎమ్మెల్యేలు మాధవరెడ్డి, నాగరాజు

సాక్షి నెట్‌వర్క్ : బంజారాల జాగృతికి సంత్ సేవాలాల్ ఎనలేని కృషి చేశారని నర్సంపేట, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్.నాగరాజు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నెక్కొండ, నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం, సంగెం, పర్వతగిరి, తదితర మండలాల్లోని సేవాలాల్ ఆలయాల్లో గిరిజనులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భోగ్ భండారో, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నెక్కొండ, పర్వతగిరి మండలాల్లో నిర్వహించిన ఉత్సవాలకు ఎమ్మెల్యేలు మాధవరెడ్డి, నాగరాజు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. హింస రహిత సమాజ నిర్మాణానికి సేవాలాల్ పాటుపడ్డారని చెప్పారు. మత్తు, ధూమపానం శాపమని హితవు పలికారని తెలిపారు. బంజారా సమాజాన్ని జాగృతం చేశాడని కీర్తించారు. కార్యక్రమాల్లో మహారాష్ట్ర బంజారా అధ్యక్షుడు బాబూసింగ్ చౌహాన్, టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ అనుబంధ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు రావుల హరీశ్‌రెడ్డి, నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి వీడి ప్రశాంతంగా చదవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి



సంగెం : సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

సాక్షి నెట్‌వర్క్ : విద్యార్థులు ఒత్తిడి వీడి ప్రశాంతంగా చదవాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ సూచించారు. సంగెం, రాయపర్తి, పర్వతగిరి, నల్లబెల్లి, ఖానాపురం, చెన్నారావుపేట మండలాల్లోని స్కూళ్లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగెం మండలంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రాయపర్తి మండలంలో డీఆర్‌డీఓ కౌసల్యదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. ఇళ్లలోనూ అనుకూల పరిస్థితులు కల్పించాలని తల్లిదండ్రులను కోరారు. పరీక్షల పట్ల భయాందోళనలు వీడాలని విద్యార్థులకు చెప్పారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, ప్రణాళికాయుతంగా చదవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. తద్వారానే మెరుగైన ఫలితాలు సాధించగలరని స్పష్టం చేశారు. పర్వతగిరి, నల్లబెల్లి, చెన్నారావుపేట, ఖానాపురం మండలాల్లో తహసీల్దార్లు వెంకటస్వామి, కృష్ణ, ఫణికుమార్, ఎంపీడీఓ అంబటి సునీల్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పడిపూజ మహోత్సవం



అభిషేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ బాధ్యులు

నర్సంపేట : ఉత్తరాషాఢ నక్షత్ర శుభ ముహూర్తాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ అధ్యక్షుడు శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆదేశాల మేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సైఫా సురేష్ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహానికి అభిషేకాలు, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు ప్రాన్స్ సతీష్ తివారి పంచలోహ విగ్రహానికి అభిషేక పూజలు చేయించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మాదారపు చంద్రశేఖర్, రాజ్యలక్ష్మి, దొడ్డ రవీందర్, రాధిక, శ్రీరాం ఈశ్వరయ్య, ఇరుకుల్ల వీరలింగం, వంగేటి గోవర్ధన్, ఇరుకు కోటేశ్వర్‌రావు, చకిలం కృష్ణమూర్తి శారద, బొద్దుల దివాకర్, అనంతుల రాంనారాయణ, మల్యాల రాజు శ్రీలత, దొడ్డ వేణు, ఆకుల ప్రభాకర్, బండారుపల్లి చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా మొక్కలు నాటాలి

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మొక్క నాటి నీళ్లు పోస్తున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఊరూరా మొక్కలు నాటాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని నందిగామలో శనివారం ఆయన మొక్క నాటి గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ పల్లెలన్నీ పచ్చదనంతో పరిఢవిల్లాలనే కాంక్షతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హరిత హారం కార్యక్రమాన్ని చేపట్టి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు చెట్టుపల్లి మురళీధర్, నాయకులు గందు శ్రీధర్, నాగులగాని నాగేశ్వర్‌రావు, జంగిలి రాజు, గుగులోత్ సారయ్య, మేడిపల్లి వెంకట్రాజం, మేడిపల్లి సదయ్య, అడ్డ రాజు, అమ్మ కుమార్, మూడు రాములు, హింగె లింగమూర్తి, మోర్తాల లింగమూర్తి, మేడిపల్లి శంకరయ్య, గుగులోత్ రఘు, గాజులపాటి కిషన్, కొల్లూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళల అభ్యున్నతే ధ్యేయం

- 'ఎఫ్ఎంఎం' డైరెక్టర్ సిస్టర్ సహాయ



మహిళలకు మగ్గం సామగ్రి అందజేస్తున్న సహాయ, తదితరులు

నర్సంపేట : పేద మహిళల అభ్యున్నతే ధ్యేయంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ తెలిపారు. వరంగల్‌కు చెందిన సాంఘిక సేవా సంస్థ సహకారంతో పేద మహిళలకు మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మగ్గం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆమె శనివారం ప్రారంభించి మాట్లాడారు. నైపుణ్య శిక్షణ మహిళల ఆర్థిక, సామాజిక ప్రగతికి బాటలు వేస్తుందని చెప్పారు. సమాజంలో మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్న దుస్థితి నెలకొందని తెలిపారు. ఈ క్రమంలో మహిళలు సాధికారత సాధించే దిశగా విద్య, ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధి ఉపయోగపడతాయని వివరించారు. మహిళలు మగ్గం శిక్షణను వినియోగించుకుని స్వయం ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ వినోద, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, స్వయంకృషి సంస్థ కార్యదర్శి బెజ్జంకి ప్రభాకర్, ప్రతిభా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, సంస్థ మేనేజర్ అజయ్‌కుమార్, ట్రెయినర్లు లక్ష్మి, షరీఫా, తదితరులు పాల్గొన్నారు.